


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 17-11-2022 సంపుటి : 04 సంచిక : 77 పేజీలు : 4 వెల : రూ 3-00


## పద్మాలయ స్టూడియోలో కృష్ణకు నివాళి..

### కుటుంబ సభ్యులకు సీఎం జగన్ పరామర్శ



హైదరాబాద్: తెలుగు చలన చిత్ర పరిశ్రమ దిగ్గజం, నటశేఖర సూపర్ స్టార్ కృష్ణకు కడసారి వీడ్కోలు పలికేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారు.బుధవారం ఉదయం తాడేపల్లి(గుంటూరు) నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన.. పద్మాలయ స్టూడియోకు వెళ్లారు. అక్కడ కృష్ణ పార్థివ దేహానికి ఆయన నివాళులు అర్పించారు.పద్మాలయ స్టూడియోలో ప్రజల సందర్శన కోసం ఉంచిన కృష్ణ పార్థివ దేహానికి.. ఏపీ సీఎం వైఎస్ జగన్ నివాళులర్పించారు. అనంతరం.. ఘట్టమనేని కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు. కృష్ణ తనయుడు మహేష్ బాబుని హత్తుకుని ఓదార్చారు సీఎం జగన్.నట దిగ్గజానికి నివాళి అర్పించిన వాళ్లలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో పాటు మంత్రి వేణుగోపాలకృష్ణ, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.నటశేఖరుడు, తెలుగు ఇండస్ట్రీ సూపర్ స్టార్ కృష్ణకు నివాళి అర్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైదరాబాద్‌కు వచ్చారు.శ్వాస కోశ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న కృష్ణ ఆదివారం సాయంత్రం గుండెపోటుకి గురికాగా.. నగరంలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో ఆయన్ని కుటుంబ సభ్యులు చేర్చారు. సోమవారం సాయంత్రం ఆయన పరిస్థితి విషమించగా.. మంగళవారం వేకువ ఝామున నాలుగు గంటల ప్రాంతంలో ఆయన కన్నుమూసినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో ఆయన అభిమాన గణం, యావత్ తెలుగు సినీ పరిశ్రమ విషాదంలో మునిగింది.

# రెండోరోజు జి 20 సమ్మిట్



### వివిధ దేశాధినేతలతో మోడీ భేటీ

### మాంగ్రోవ్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటిన ప్రధాని



హైదరాబాద్,నవంబర్16: ఇండోనేషియాలో చివరిరోజు జీ 20 సమ్మిట్ సరదాగా కొనసాగింది. మాంగ్రోవ్ ఫారెస్ట్‌లో వివిధ దేశాల అగ్రనేతలు సమావేశం అయ్యారు. మాంగ్రోవ్ అలయన్స్ ఫర్ క్లైమేట్ లో భారత్ చేరింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ, మాంగ్రోవ్ ఫారెస్ట్ ను సందర్శించారు. అనంతరం మోడీతో పాటు ఇతర దేశాల నేతలు మొక్కలు నాటారు. పర్యావరణం, హెల్త్ అంశాలపై చర్చించారు. ఇండోనేషియా ప్రధాని విడోడో, స్పెయిన్ ప్రధాని పెడ్రో, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తో పాటు సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్ తో మోడీ సమావేశం అయ్యారు. పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు. మరోవైపు తొలిరోజు జరిగిన సదస్సులో వివిధ దేశాధినేతలతో మోడీ సమావేశమయ్యారు. దౌత్య సంబంధాలు, అభివృద్ధి సహా వివిధ అంశాలపై ప్రధాని చర్చించారు. గాల్వాన్ ఘటన తర్వాత ఫస్ట్ టైం జీ20 సమ్మిట్ లో మోడీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ సమావేశమయ్యారు. అంతే కాకుండా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తో మోడీ భేటీ అయ్యారు. రెండు దేశాల వ్యూహాత్మక బంధంపై ఇద్దరు సమీక్ష నిర్వహించారు. సాంకేతికత సహా వివిధ కీలకరంగాలపై సమీక్ష జరిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలతో పాటు రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై భేటీలో చర్చించారు. అలాగే జీ20 సదస్సులో బ్రిటన్ కొత్త ప్రధాని రిషి సునాక్ ను మోడీ కలిశారు. సమావేశాల్లో భాగంగా మోడీ, రిషి సునాక్ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతుందని ప్రధాని మోడీ అన్నారు. భారత్ ప్రతిభకు ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలకు భారత సంతతి వ్యక్తులే సీఈవోలుగా ఉన్నారని తెలిపారు. భారత్, ఇండోనేషియా మధ్య బలమైన సంబంధాలున్నాయన్నారు. ప్రపంచ శాంతి కోసం అందరు కలిసి కృషి చేయాలని మోడీ పిలుపునిచ్చారు. మరోవైపు ఇవాళ జీ 20 ముగింపు సభలో జీ 20 అధ్యక్ష బాధ్యతలు భారత్ కు అప్పగించనుంది ఇండోనేషియా. డిసెంబర్ నుంచి జీ 20 సమ్మిట్ భారత్ నేతృత్వంలో జరుగనుంది.

## 175 సీట్లు మాట దేముడెరుగు.. ఇరవై సీట్లు వస్తే గొప్పే

### వైసీపీ ఎంపీ రఘురామ క్రిష్ణం రాజు



అమరావతి నవంబర్ 16 ఏపీలో బలమైన పార్టీగా వైసీపీ ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతారు. ఇక జగన్ అయితే 175 కి 175 సీట్లు ఎందుకు రావు అని పార్టీ వారికి చెబుతూ సమీక్షలు నిర్వహిస్తారు. ఏపీపీలో విపక్షం అన్నది లేకుండా మొత్తానికి మొత్తం మేమే గెలుచుకుంటామని జగన్ గట్టిగానే ప్రకటిస్తున్నారు. చాలా మంది వైసీపీ నేతలు మంత్రులు కూడా తిరుగులేని మెజారిటీతో మరోసారి ఏపీలో వైసీపీ గెలిచి తీరుతుందని సవాళ్ళు కూడా చేస్తున్నారు.ఇక విపక్షాలు మేమీ గెలుస్తామని చెప్పుకుంటున్నాయి. పొత్తుల విషయనంలో కూడా ఎవరి వ్యూహాలు వారు రూపకల్పన చేసుకుంటున్నాయి. సర్వేలు కూడా తమ పార్టీ గెలుస్తుంది అంటే తమ పార్టీ గెలుస్తుంది అని చెప్పుకునేలా చేయించుకుంటున్నాయి. అయితే వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోతుంది అని ఆ పార్టీకే చెందిన ఎంపీ రఘురామ క్రిష్ణం రాజు అంటున్నారు.ఆయన తాజాగా ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సంచలన కామెంట్స్ చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 175 సీట్లు మాట దేముడెరుగు గట్టిగా ఇరవై సీట్లు వస్తే గొప్పే అని ఆయన చెప్పడం గమనార్హం. ఏపీ జనాలు వైసీపీ మీద పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని వారు ఏపీలో వైసీపీని దించడానికి చూస్తున్నారని రఘురామ తనదైన సర్వేను ఆవిష్కరించారు.అంతే కాదు ఏపీలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా కూడా జనాలు ఈసారి వైసీపీకి ఓటేయరని అది తమ సొమ్ము అని తాము పన్నులతో కట్టిన డబ్బులనే తిరిగి ఇస్తున్నారు అని జనాలు తెలుసుకున్నారని ఆయన విశ్లేషిస్తున్నారు. ఏపీలో వైసీపీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయని వ్యవస్థలను పూర్తిగా విధ్వంశం చేయడం అభివృద్ధి లేకపోవడం ప్రతిపక్షాలను హింసించడం వంటి అనేక కారణాల్తో పాటు ప్రజల మీద ఎన్నో భారాలు వేశారని అన్నారు.విద్యుత్ పన్నులతో పాటు నిత్యావసర ధరలు పెంచారని ఏపీలో పెట్రోల్ వంటి వాటి మీద పన్నులు ఎక్కువ చేశారని ఇదంతా సామాన్య మధ్యతరగతి వర్గాలు వైసీపీ మీద తిరుగుబాటు చేయడానికి కారణాలు అని ఆయన అన్నారు. ఏపీలో రాజకీయంగా ఈసారి వైసీపీకి చుక్కలు చూపించేందుకు జనాలు సిద్ధంగా ఉన్నారని రాజు గారు అంటున్నారు.ఇదిలా ఉంటే రఘురామ మరింత ఆసక్తిని గొలిపే విషయాలను కూడా ప్రస్థావించారు. వైసీపీ తానుగా చేయించుకున్న సర్వేలలో కూడా ఈసారి నలభై సీట్లు మాత్రమే వస్తాయని తేలిందని చెప్పుకొచ్చారు. ఏపీలో వైసీపీకి ఈసారి ఉభయ గోదావరి జిల్లాల్తో పాటు క్రిష్ణా ఉత్తరాంధ్రా జిల్లాలలో పరిస్థితి చాలా దయనీయంగా ఉందని రాజు గారు పేర్కొన్నారు.ఆఖరుకు ప్రశాంత్ కిశోర్ కూడా మరోసారి ఏపీలో వైసీపీ అధికారంలోకి రాదు అని తేల్చేశారు అని రాజు గారు చెప్పడం విశేషం. ఇక వచ్చే ఎన్నికల్లో సగం మంది సిట్టింగులకు టికెట్ ఇవ్వను అని జగన్ అంటే అది ప్రతిపక్షలా నెత్తిన పాలు పోసినట్లే అని రాజు చెప్పుకొచ్చారు. జగన్ ఈ మధ్య తీసుకున్న అనేక నిర్ణయాలు అన్నీ కూడా విపక్షానికి కలిసివచ్చేవే అని ఆయన పేర్కొన్నరు. అదే విధంగా వైసీపీ డబ్బులిచ్చి గెలవాలని చూస్తోందని కానీ ఆ పార్టీ ఇచ్చే డబ్బులు తీసుకుని జనాలు విపక్షానికి ఓటు వేస్తారని ఆయన చెబుతున్నారు.తెలంగాణాలో మునుగోడు ఉప ఎన్నికల్లో టీయారెస్ గెలవడం వేరు ఏపీలో రాజకీయ పరిస్థితులు వేరు అని ఆయన అంటున్నారు. కేసీయార్ పాలన ఏపీలో జగన్ పాలన కంటే చాలా రెట్లు బెటర్ గా ఉందని అందుకే ఆ ఉప ఎన్నికల్లో ఆ పార్టీని గెలిపించారని ఏపీలో మాత్రం వైసీపీని చిత్తుగా జనాలు ఓడిస్తారు అంటూ రెబెల్ రాజా వారు తన సర్వేను చదివి వినిపించారు. నిజంగా అలాగే జరుగుతుందా. ఏపీలో వైసీపీ ఘోరంగా ఓడుతుందా. ఇరవై సీట్లు కూడా ఆ పార్టీకి రావా అంటే చూడాలి మరి.

## మహాప్రస్థానంలో ముగిసిన కృష్ణ ప్రస్థానం

### అశ్రునయనాలు..అశేష జనవాహిని మధ్య అంతిమ సంస్కారం

### పోలీస్ గౌవ వందనంతో అధికార లాంఛనాల మధ్య అంత్యక్రియలు



హైదరాబాద్,నవంబర్16 : అశేష జనవాహిని..అశ్రునయనాల మధ్య సూపర్ స్టార్ కృష్ణ అంత్యక్రియలు ముగిసాయి. ఈ భూమితో బంధం తెంచుకున్న కృష్ణ తనవారందరికీ వీడ్కోలు చెప్పి దివికేగారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాల మధ్య సూపర్ స్టార్ కృష్ణ అంత్యక్రియలు ముగిశాయి. మూడురౌండ్లు గాల్లో కాల్పులు జరిపి పోలీసులు గౌరవవందనం సమర్పించారు. ఘట్టమనేని కుటుంబ సభ్యుల అశ్రు నివాళుల మధ్య కృష్ణ అంత్యక్రియలు పూర్తయ్యాయి. అంతకు ముందు నానక్ రామ్ గూడలోని పద్మాలయ స్టూడియో నుంచి మహాప్రస్థానం వరకు కృష్ణ అంతిమయాత్రను నిర్వహించారు. తమ అభిమాన నటుడిని కడసారి చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. తెలంగాణతో పాటు.. ఏపీ జిల్లాల నుంచి ఫ్యాన్స్ భారీగా వచ్చారు. దీంతో నానక్ రామ్ గూడ, ఫిల్మ్ నగర్ ఏరియాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కడసారిచూపు కోసం భారీగా అభిమానులు తరలివచ్చారు. పద్మాలయ స్టూడియోస్ నుంచి ఆయన పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్ మహా ప్రస్థానానికి తీసుకువచ్చారు. కృష్ణకు వారి కుటుంబ ఆచారం ప్రకారం వైష్ణవ సంప్రదాయంలో నుదుటిన వైష్ణవ నామం పెట్టారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు చెందిన సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులంతా కృష్ణ పార్థివదేహానికి నివాళులర్పించిన సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్‌తో పాటు తెలంగాణ గవర్నర్ తమిళిసై కూడా కృష్ణ భౌతికకాయానికి అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పద్మాలయ స్టూడియోస్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు అంతిమయాత్ర మొదలవగా మహాప్రస్థానంలో కృష్ణ అంత్యక్రియలు జరిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఘట్టమనేని అభిమానులు చివరిసారి తమ అభిమాన నటుడిని చూసేందుకు తరలివచ్చారు. పద్మాలయ స్టూడియోస్ నుంచి అంతిమయాత్రలో భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. పద్మాలయ స్టూడియోస్ నుంచి అభిమానుల జన సంద్రంలో కృష్ణ గారి అంతిమయాత్ర జరిగింది. కేవలం కొద్దిమంది కుటుంబ సభ్యుల సమక్షంలోనే కృష్ణ గారి అంత్యక్రియలు జరిగాయి. తెలుగు సినిమా చరిత్రలో సూపర్ స్టార్ కృష్ణ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. తొలి సినిమా నుంచి సాహసమే తన ఊపిరి అనేలా సినిమాలు సెలెక్ట్ చేసుకున్నారు. తెలుగు తెరకు సరికొత్త సాంకేతిక పరిచయం చేశారు కృష్ణ.స్టార్ హీరోగానే కాదు మంచి మనిషిగా కూడా కృష్ణ నిర్మాతలకు అండదండలు అందించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకుంటూ ఆ మంచి మనిషికి వీడ్కోలు పలికారు. నటుడు మురళీ మోహన్ పాడె మోయడమే గాకుండా అంతిమాయాత్ర వెంట నడిచారు.

## కృష్ణ అద్భుతమైన వ్యక్తి.. మంత్రి రోజా ఎమోషనల్ వ్యాఖ్యలు

సూపర్ స్టార్ కృష్ణ(79) మృతితో ఘట్టమనేని కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన అకాల మరణంతో కుటుంబ సభ్యులంతా శోకసంద్రంలో మునిగిపోయారు.వారి కుటుంబానికి భగవంతుడు ఆత్మస్థైరాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తూ సినీ, రాజకీయ



ప్రముఖులు కృష్ణ మృతిపై సంతాపం ప్రకటిస్తున్నారు.ఇక, సూపర్ స్టార్ కృష్ణ పార్థివదేహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆర్కే రోజా, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నివాళులు అర్పించారు. అనంతరం, మంత్రి రోజా మీడియాతో మాట్లాడుతూ.. సూపర్ స్టార్ కృష్ణ అద్భుతమైన వ్యక్తి. సాహసాలు, సంచనాలకు కేరాఫ్ అడ్రస్. అందరూ ఇష్టపడే ఒకే ఒక్క హీరో కృష్ణ. ఆయన లేరు అంటే ఎవరూ కూడా జీర్ణించుకోని పరిస్థితి.సినీ ఇండస్ట్రీకి పెద్ద దిక్కైన ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణంరాజు, ఇప్పుడు కృష్ణ లేకపోవడం తీరని పెద్దలోటు. నా చిన్నతనం నుంచి నేను కృష్ణకు అభిమానిని. ఆయన సొంత బ్యానర్‌లో నేను సినిమా చేయడం నా అదృష్టం. కృష్ణ గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రతీ ఒక్కరి లైఫ్‌లో సక్సెస్, ఫెయిల్యూర్ అనేది ఉంటుంది. ఇది కృష్ణను చూసి నేర్చుకోవాలి' అంటూ కామెంట్స్ చేశారు.

## కుష్టు అంటు వ్యాధి కాదు

మదనపల్లె లెప్రసీ అన్నది అంటు వ్యాధి కాదని, వారిని ఆదరించి భరోసా కల్పించాలని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆంజనేయులు తెలిపారు. నేడు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు లెప్రసీ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్, అమ్మచెరువుమిట్ట డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లెప్రసీ వ్యాధి నివారణకు ఎంతో కృషి చేస్తున్నాయని తెలియజేశారు.

# సంపాదకీయం

గురువారం 17-11-2022

## ప్రజాప్రతినిధుల మనీలాండరింగ్ పై ఆలస్యమెందుకు

మనీ లాండ రింగ్, నగదు అక్రమ చెలామణి కేసుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులను త్వరితగతి విచారణకు సహకరించడానికి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది విజయ్ హన్స్ రాజ్ ను అమికస్ క్యూరీగా నియమించింది. విజయ్ హన్స్ రాజ్ మంగళవారం ఒక నివేదికను సుప్రీంకోర్టుకు అందించారు. అందులో ప్రజా ప్రతినిధులు ఎదుర్కొంటున్న పీఎంఎల్ఏ (మనీ లాండరింగ్) కేసుల వివరాలున్నాయి. ప్రస్తుత, మాజీ ఎంపీల్లో 51 మందిపై మనీ లాండరింగ్ కేసులున్నాయని, అలాగే, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో 71 మంది ఈ ఆరోపణలను ఎదుర్కొంటున్నారని ఆ నివేదికలో విజయ్ హన్స్ రాజ్ సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే, ఎంపీల్లో మాజీలు ఎంతమంది, సిట్టింగ్ లు ఎంత మంది అనే వివరాలను వెల్లడించలేదు. మాజీ, ప్రస్తుత ఎంపీలు, అలాగే, మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేలపై సీబీఐ విచారణ కొనసాగుతోందని నివేదిక వెల్లడించింది. చాలా కేసుల విచారణ నిలిచిపోయిందని, కొన్ని కేసులు ఐదేళ్లకు పైగా కొనసాగుతున్నాయని తెలిపింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసులను త్వరిత గతిన విచారించేలా ఆదేశాలు జారీ చేయాలన్న సీనియర్ న్యాయవాది దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి సంబంధించి సుప్రీంకోర్టు ఈ విచారణ చేపట్టింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎన్?ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సీబీఐ నమోదు చేసిన కేసుల దర్యాప్తు, విచారణను పూర్తిచేయడంలో జాప్యం జరగడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. "దాదాపు 200 కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి.. 10 నుంచి 15 ఏళ్లుగా చార్జ్‌షీట్లు దాఖలు చేయడం లేదని...చార్జ్‌షీట్లు దాఖలు చేయకపోవడానికి కారణాలేంటనేది కూడా చెప్పలేదు. కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను అటాచ్ చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొంది. ఎంపీలు, ఎమ్మెల్యేల అవినీతిపై దాఖలైన కేసుల విచారణ చాలా ఆలస్యంగా జరుగుతోంది. ట్రయల్ కోర్టుల్లో అయిదేళ్లుగా అవి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన కేసుల విచారణ త్వరగా జరిగేలా చూడాలంటూ బీజేపీ నాయకుడు అశ్విన్ కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిల్ ఈ నెల 17న సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. అమికస్ క్యూరీగా నియమితులైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా సోమవారం తన నివేదికను సమర్పించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలపై సీబీఐ నమోదు చేసిన 121 కేసులు ట్రయల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఎంపీల విభాగంలో మొత్తం 51 కేసులు నమోదు కాగా, 112 మంది ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. మరో 37 కేసులు సీబీఐ వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. మనీలాండరింగ్ ఆరోపణలపై 51 మంది సిట్టింగ్, మాజీ ఎంపీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులు నమోదు చేసింది. 71 మంది సిట్టింగ్, మాజీ ఎమ్మెల్యేలపైనా కేసులు పెట్టింది. సకాలంలో విచారణ జరిగేలా ట్రయల్ కోర్టులను ఆదేశించాలని అమికస్ క్యూరీ సుప్రీంకోర్టును కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పర్యవేక్షణకు మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో సిట్టింగ్ మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై కలిపి 92 కేసులు పెండింగ్‌లో ఉండగా... అందులో ఐదేళ్లకు పైగా పెండింగ్ ఉన్న కేసుల సంఖ్య 50 ఉందని హన్సారియా నివేదిక స్పష్టం చేసింది. ఏపీలో వారెంట్లు, సమన్లపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌వోలకు ప్రత్యేక కోర్టులు ఆదేశించిందని తెలిపారు. ఈ కేసులను రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఒక ప్రత్యేక కోర్టు ఉందని చెప్పారు. 25 హైకోర్టులకు గాను 16 హైకోర్టుల నుంచి కేసుల వివరాలు వచ్చాయి. తెలంగాణ హైకోర్టు నుంచి వివరాలు రాలేదని హన్సారియా పేర్కొన్నారు. ప్రత్యేక కోర్టులు కేవలం ఇవే కేసులను విచారించాలి. సీఆర్‌పీసీ సెక్షన్ 309 ప్రకారం రోజూవారీ ట్రయల్‌ను నిర్వహించాలి. పరిస్థితుల్లో తప్పా వాయిదాలు ఇవ్వకూడదు. ట్రయల్‌కు ప్రాసిక్యూషన్, డిఫెన్స్ సహకరించాలి. ప్రత్యేక కోర్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలి. నిందితులు ట్రయల్ జాప్యానికి ప్రయత్నిస్తే బెయిల్ రద్దు చేయాలి. జీవిత ఖైదు, మరణ శిక్ష పడే అవకాశమున్న కేసుల విచారణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ తర్వాత ఏడేళ్లు అంతకుమించి జైలు శిక్ష పడే కేసులు అందులోనూ సిట్టింగ్ ప్రజాప్రతినిధుల కేసుల విచారణకు ప్రాధాన్యమివ్వాలి. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టడం, నాన్ బెయిలెబుల్ వారెంట్లను అమలు చేయించే బాధ్యత సంబంధిత ఎస్‌హెచ్‌వోపై ఉంటుంది. ఒకవేళ సాక్షులు, నిందితులను ప్రవేశపెట్టడంలో విఫలమైతే నివేదికను జిల్లా ఎస్పీకి కోర్టులు పంపించాలి

# ఒంటరి పోరాటానికి పవన్ మొగ్గు



విజయవాడ, నవంబర్ 16, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీ పర్యటన తర్వాత రాజకీయాల్లో మార్పులు కనిపిస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతం కంటే భిన్నమైన ప్రకటనలు చేస్తున్నారు. ఒక్క చాన్స్ ఇవ్వమని ప్రజల్ని కోరుతున్నారు. అన్ని చోట్లా అభ్యర్థుల్ని పెడతానని.. ఎవరైనా అడ్డుకుంటే సంగిత చూస్తానని హెచ్చరిస్తున్నారు. నిన్నటిదాకా ఆయన ఓట్లు చీల్చబోనని అన్న ప్రకటనలకు.. ఇప్పుడు చేస్తున్న ప్రకటనలకు చాలా తేడా ఉంది. అందుకే పవన్ కల్యాణ్ రూటు మార్చుకున్నారా ? ఒంటరి పోరాటానికి మొగ్గు చూపుతున్నారా అనే వాదన వినిపించడం ప్రారంభమైంది. ప్రధానమంత్రి మోదీతో భేటీ జరిగిన మూడు రోజుల తర్వాత పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. వీరుడు.. ధీరుడు అని దేశాన్ని క్లిష్టపరిస్థితుల నుంచి కాపాడుతున్నారని అభినందించారు. ఈ మర్మమేంటో రాజకీయవర్గాలకు అంతు చిక్కకుండా ఉంది. ఒక వేళ కృతజ్ఞతలు చెప్పాలనుకుంటే అప్పుడే చెప్పి ఉంటే సరిపోయేది కానీ ప్రత్యేకంగా ఇలా పొగడ్తలకు మూడు రోజుల తర్వాత సమయం కేటాయించడమే ఆశ్చర్యకరంగా ఉంది. మోదీ సమావేశం తర్వాత ఆయనకు ఏమైనా సందేశం వచ్చిందా లేకపోతే.. సమావేశంలో తమ మధ్య జరిగిన చర్చల్లో మోదీ చెప్పిన విషయంలో ఏదైనా కొత్తగా అర్థం అయిందా అనేదానిపై క్లారిటీ మాత్రంలేదు. విజయనగరం జిల్లా గుంకలాన్ గ్రామంలో జగనన్న ఇళ్లలో అవినీతిపై పోరాటానికి వెళ్లి ప్రసంగించిన సందర్భంలో పవన్ కల్యాణ్ ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రజలను కోరారు. అంతే కాదు అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో అభ్యర్థిని పెడతా.. నామినేషన్ వేయనివ్వకపోతే ఎం చేయాలో తెలుసని హెచ్చరించారు. నామినేషన్ వేయనిస్తారా లేదా అన్న విషయం పక్కన పెడితే అన్ని చోట్లా పోటీ చేయబోతున్నామన్న సంకేతాలను పవన్ కల్యాణ్ పంపినట్లుగా తెలుస్తోంది. ప్రధానంగా వైసీపీనే టార్గెట్ చేసినా.. ఆయన తనకు చాన్స్ ఇవ్వాలని ప్రజలను అడుగుతున్నారు. ఇప్పటంలో ఇళ్ల కూల్చివేత ఘటనపై పోరాటం వల్ల తనకు .. జనసేనకు రాష్ట్ర వ్యాప్త మైలేజ్ వచ్చిందన్న అభిప్రాయం పవన్ కల్యాణ్‌లో ఉందని అంటున్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా జనసైన వైపు చూస్తారని.. అవకాశం ఇస్తారని భావిస్తున్నారని అంటున్నారు. అదే సమయంలో ఆయన బీజేపీ ప్రస్తావన కూడా తీసుకు రావడం లేదు. తానే సొంతంగా పోటీ చేయాలనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. పొత్తుల గురించి మాట్లాడటం లేదు. గతంలో చంద్రబాబునాయుడు విశాఖ ఘటనపై సంఘిభావం తెలిపినప్పుడు వైసీపీ సర్కార్‌ను కూలదోయడం కోసం కలిసి పని చేస్తామని ప్రకటించారు. అప్పుడు కూడా కలిసి పోటీ చేయడంపై ఎలాంటి ప్రకటనా చేయలేదు కానీ ఏపీ బీజేపీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడం.. వ్యూహం మార్చుకుంటున్నానని చెప్పడం ద్వారా పవన్ విధానంలో మార్పు వచ్చిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పవన్ కల్యాణ్ సినిమాలను పూర్తి స్థాయిలో వదిలేయలేరు. అది తన వృత్తి అని పార్టీని నడపడానికైనా సినిమాలు చేయాలని ఆయనంటున్నారు. అదే సమయంలో జనసేన రాజకీయ పయనం కూడా అలాగే ఉంది. ఇన్నేళ్లైనా పూర్తి స్థాయిలో పార్టీ నిర్మాణం లేదు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలా లే?కపోతే.. వైసీపీ ఓటమి కోసం పని చేయాలా అన్నదానిపైనా క్లారిటీ లేదు . ప్రస్తుతం పొత్తులో ఉన్న బీజేపీతో అయినా కలిసి ఉండాలా లేదా అన్నదానిపైనా క్లారిటీ ఉన్నట్లుగా లేదు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీలో జనసేనతో పొత్తుపై భిన్నాభిప్రాయాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. పొత్తులు వద్దని.. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వ కావాలని ప్రజలు కోరుకుంటే గెలిపిస్తారు.. లేకపోతే లేదని కొంత మంది వాదిస్తున్నారు. ఈ కారణంగా ఏపీ రాజకీయాల్లో పొత్తుల వ్యవహారాలు చివరి వరకూ తెగెలా కనిపించడం లేదు.

# డిగ్రీ కాలేజీల్లో కామన్ క్యాలెండర్

విజయవాడ, నవంబర్ 16, ఏపీలో ఉన్నత విద్యా సంస్థలకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఉమ్మడి అకడమిక్ క్యాలెండర్‌ను ఉన్నత విద్యామండలి సిద్ధం చేసింది. దీనిప్రకారం మూడేళ్ల డిగ్రీకి సంబంధించి 6 సెమిస్టర్లను, పరీక్షల తేదీలను ఉన్నత విద్యామండలి ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని కళాశాలలు ఈ షెడ్యూలను పాటించాల్సి ఉంటుంది. యూజీసీ ఆదేశాల మేరకు అన్ని యూనివర్సిటీలు ఉమ్మడి క్యాలెండర్‌ను ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే.

సెమిస్టర్ షెడ్యూలు..

డిగ్రీ (యూజీ) కోర్సులకు మొదటి సెమిస్టర్‌ను వచ్చే ఏడాది జనవరి 28లోపు పూర్తి చేయాలి.

ఇక రెండో సెమిస్టర్‌ను ఫిబ్రవరి 6న మొదలుపెట్టి మే 20తో ముగించాల్సి ఉంటుంది.

కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టు మే 29 నుంచి జులై 8 వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీరికి రెండో ఏడాది తరగతులు జులై 10 నుంచి ప్రారంభమవుతాయి.

డిగ్రీ మూడో సెమిస్టర్ నవంబరు ఒకటి నుంచి మొదలై ఫిబ్రవరి 18తో ముగుస్తుంది.

నాలుగో సెమిస్టర్ ఫిబ్రవరి 29న ప్రారంభమై జూన్ 17తో ముగుస్తుంది. వీరికి 2023-24 విద్యా సంవత్సరం ఆగస్టు 7నుంచి మొదలవుతుంది.

ఐదో సెమిస్టర్ తరగతులు, ఇంటర్న్‌షిప్ నవంబరు 17 నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 28తో ముగుస్తుంది.

ఆరో సెమిస్టర్ తరగతులు, ఇంటర్న్‌షిప్ మార్చి 13 నుంచి జూన్ 10వరకు కొనసాగుతాయి. పరీక్షల మదింపు జూన్ 12-24 వరకు ఉంటుంది.

పరీక్షల షెడ్యూలు ఇలా...

మొదటి సెమిస్టర్ పరీక్షలను జనవరి 30 నుంచి ఫిబ్రవరి 4 వరకు నిర్వహించనున్నారు.

రెండో సెమిస్టర్ పరీక్షలను మే 22 నుంచి మే 27 వరకు నిర్వహించనున్నారు.

మూడో సెమిస్టర్ పరీక్షలను ఫిబ్రవరి 20 నుంచి ఫిబ్రవరి 28 వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

నాలుగో సెమిస్టర్ పరీక్షలు జూన్ 19 నుంచి జూన్ 24 వరకు ఉంటాయి. షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ (200 గంటలు) జూన్ 26 నుంచి ఆగస్టు 5 వరకు చేయాల్సి ఉంటుంది.

ఐదో సెమిస్టర్ సెమిస్టర్ పరీక్షలు, ఇంటర్న్‌షిప్ మదింపు మార్చి 1 నుంచి 11 వరకు కొనసాగనున్నాయి.

ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ మార్చి 13 నుంచి జూన్ 10 వరకు, పరీక్షల మదింపు జూన్ 12 - 24 వరకు ఉంటుంది.

యూజీ ఆయూష్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటన జారీచేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆయూష్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైఎస్ కోర్సులల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ నవంబరు 12న నోటిఫికేషన్ జారీ చేసింది. 50 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీకు 40 శాతం, దివ్యాంగుకు 45 శాతం మార్కులు) ఇంటర్ (బైపీసీ) ఉత్తీర్ణులై , నీట్-2022లో అర్హత సాధించిన అభ్యర్థులు నవంబరు 13న ఉదయం 8 గంటల నుండి నవంబరు 20న రాత్రి 8 గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు సూచించారు. నిర్దేశిత దరఖాస్తు పూర్తి చేయడంతో పాటు అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

కోర్సులు, దరఖాస్తు వివరాల కోసం క్లిక్ చేయండి..తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా డ్యూయల్ డిగ్రీ కోర్సుకు జేఎన్‌టీయూ శ్రీకారం చుట్టింది. బీటెక్‌తో పాటు బీబీఏ చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. ఈ మేరకు వారం రోజుల్లో బీబీఏ(డేటా అనలిటిక్స్)లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఇంజినీరింగ్‌తోపాటు అడ్మినిస్ట్రేటివ్ నైపుణ్యాలు ఉంటే సులువుగా ఉద్యోగాలు పొందే వీలుంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు

# 25 మందికి సిట్టింగ్ లకు గల్లంతేనా

విజయవాడ, నవంబర్ 16, ఏపీలోని వైసీపీ ఎమ్మెల్యేలు పరిస్థితి కూడా అదే మాదిరిగా మారిందనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. పార్టీ ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన ప్రతిసారీ జగన్ వారిపట్ల ఆగ్రహం వ్యక్తం చేయడం, వారినే తప్పుపడుతుండడం, వారి పనితీరుపై వ్యతిరేక సర్వే నివేదికలతో భవిష్యత్తులో సీట్లు ఇచ్చేది లేదని బెదిరింపులకు దిగుతుండడంపై వైసీపీ ప్రస్తుత ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల్లో తీవ్ర అసహనం వ్యక్తమౌతోందని అంటున్నారు. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో తమకు జగన్ సీటు ఇచ్చే ఛాన్స్ లేదని గట్టిగా భావిస్తున్న సిటింగ్ లు, ఒకవేళ వైసీపీ నుంచి సీటు వచ్చినా.. జగన్ సర్కార్ పై ఏపీ వ్యాప్తంగా పెల్లుబుకుతున్న వ్యతిరేకత కారణంగా ఆ పార్టీ నుంచి గెలిచే అవకాశాలు కనిపించని వారు గోడ దూకేందుకు సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది. తద్వారా అయినా తమ రాజకీయ భవిష్యత్తును సజీవంగా ఉంచుకోవాలని పలువురు ఎమ్మెల్యేలు ప్రణాళికలు వేసుకుంటున్నారని అంటున్నారు. ఈ క్రమంలోనే వారు వైసీపీకి గుడ్ బై చెప్పేసి.. ఏ పార్టీలో చేరితే తమ భవిష్యత్తు బాగుంటుంది.. విజయావకాశాలు మెరుగవుతాయి అనే లెక్కలు వేసుకుంటున్నారనే అభిప్రాయాలు వస్తున్నాయి. వచ్చే డిసెంబర్ లో జరిగే వైసీపీ శిబిరంలో వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేల భవితవ్యంపై ఓ స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. ఇప్పటికే జగన్ నుంచి వస్తున్న హెచ్చరికల నేపథ్యంలో టికెట్లు రావనుకుంటున్న వారు, ఒకవేళ టికెట్ వచ్చినా గెలిచే ఛాన్స్ లు తక్కువని భయపడుతున్నవారు, వైసీపీలో కంటే ప్రత్యర్థి పార్టీలు బలంగా ఉన్నాయనుకుంటున్నవారు వైసీపీ బంధనం నుంచి ఎలా బయట పడాలా అని దిక్కులు చూస్తున్నారని తెలుస్తోంది. అలా పక్కదార్లు వెతుక్కుంటున్న వైసీపీ ఎమ్మెల్యేల సంఖ్య 25 నుంచి 30 వరకు ఉంటుందంటున్నారు. దాంతో పాటు టీడీపీ-జనసేన-బీజేపీ మధ్య పొత్తు పొడిస్తే.. ఇక తమ ఉనికికి గండం తప్పదని భయపడుతున్న వారు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారంటున్నారు. ఏయే ఎమ్మెల్యేలు వైసీపీని వదిలిపెట్టేస్తారు..? అలాంటి వారి కోసం ఆపరేషన్ ఆకర్ష్ అమలు చేసే పార్టీలు ఏవి అనే అంశాలపై వైసీపీ అధినాయకత్వం గట్టి నిఘాయే పెట్టిందంటున్నారు. వైసీపీ నుంచి ఎవరెవరు పార్టీ ఫిరాయిస్తారు అనే దానిపై జగన్ రెడ్డి ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి కూడా కీలక సమాచారం తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. వైసీపీ గోడ దూకి బయటి పార్టీల వైపు చూసే ఎమ్మెల్యేలు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎక్కువగా ఉంటారని అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే.. ఆ జిల్లాల్లో టీడీపీ, జనసేన పార్టీ దేనికదే బలంగా ఉండడమే కారణం అంటున్నారు. ఈ రెండు పార్టీ మధ్య పొత్తు కుదిరితే వచ్చే ఎలక్షన్ వార్ లో విజయం వన్ సైడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. దాంతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి కూడా పలువురు వైసీపీకి గుడ్ బై చెప్పే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల నుంచి కూడా కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు సిద్ధం అవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే వారు ప్రత్యర్థి పార్టీలతో నిరంతరం టచ్ లో ఉంటున్నారని, వైసీపీని వదిలిపెట్టేసినా తమ స్థానానికి భంగం కలగకుండా చూసుకుంటున్నారంటున్నారు.

# రుషికొండలో ప్రతీదానికి రుసుమే

విశాఖపట్టణం, నవంబర్ 16, రుషికొండ బీచ్ లో అడుగు పెట్టాలంటే ప్రవేశ రుసుము చెల్లించాల్సిందేనని వైసీపీ ప్రభుత్వం అంటోంది. ఈ క్రమంలోనే ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ బీచ్ నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేలా నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి గత నెలలోనే టెండర్లు ఆహ్వానించారు. గడువులోగా ఎవరూ స్పందించకపోవడంతో రెండోసారి టెండర్ పిలిచింది. ఈనెల ఏడవ తేదీన దీనికి సంబధించి ప్రీబిడ్ సమావేశం జరిగింది. ఈనెల 18వ తేదీన టెండర్ తెరవనున్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆకట్టుకునే స్థాయిలో బీచ్ లో ప్రమాణాలు పాటించాలి. ఏపీటీడీసీ దీని నిర్వహణ చేపట్టడంతో విఫలం అవుతోంది. అయితే ఏటా లక్షల రూపాయలు ఇందు కోసం వెచ్చించాల్సి వస్తోంది. అయినప్పటికీ తగిన ప్రణామాలు పాటించలేకపోతుందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రైవేటుకు అప్పగించడం ద్వారా ఖర్చు తగ్గించుకునే మార్గంతో పాటు ఏపీటీడీసీకు కొంత ఆదాయం వస్తుందని అప్పగించేస్తున్నారు. దీంతో ఇక్కడి బీచ్ కు వచ్చే పర్యాటకుల మీద భారం పడబోతుంది. సాధారణ రోజుల్లో వేల సందర్శకులు పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. వారాంతాలు, ప్రత్యేక రోజుల్లో మరింత మంది ఎక్కవుతుంటారు. త్వరలోనే ప్రవేశ రుసుం మొదలుకొని పార్కింగ్, బీచ్ లో సౌకర్యాలు, సేవలను వినియోగించుకున్నందుకు సందర్శకుల నుంచి టిక్కెట్ల రూపంలో వివిధ రకాల రుసుముల్ని ప్రైవేటు సంస్థ ద్వారా వసూలు చేయనున్నారు. ప్రస్తుతం కేవలం పార్కింగ్ రుసుము మాత్రమే వసూలు చేస్తున్నారు. భారత దేశ బ్లూ ఫ్లాగ్ బీచ్స్ మిషన్ నుంచి రుషికొండ బీచ్ కు ఎకో లేబుల్ 'బ్లూ ఫ్లాగ్' వచ్చింది. దీంతో ఈ బీచ్‌కు ఇప్పుడు గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో స్థానం లభించింది. ఈ ప్రాజెక్ట్ కోసం 2017లో రుషికొండ బీచ్ నామినేట్ చేయబడగా, 2018 ఫిబ్రవరిలో ఖరారు చేయబడింది. అవుట్డోర్ ఫిట్నెస్ పరికరాలు, నిరంతరం బీచ్ శుభ్రపరిచే యంత్రాలు, సిసిటివి కెమెరాలు, లైఫ్ గార్డ్లు వంటి భద్రతా పరికరాలు ఈ ప్రాజెక్టులో భాగంగా అందించబడ్డాయి. అయితే బ్లూఫ్లాగ్ బీచ్ లో మౌలిక వసతుల కల్పనతో పాటు మొత్తం నిర్వహణ, తీరంలో సురక్షిత విధానాల పాటింపు, పహారా సేవలు అందించాలి. లైఫ్ గార్డులు, మూత్ర శాలల, మరుగు దొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, సౌర విద్యుత్తు, తాగునీటి నిర్వహణ చేపట్టాలి. వ్యర్థాల నిర్వహణ, ఎల్ఈడీ విద్యుత్తు దీపాలు, నడక దారులు, సీసీ టీవీ కెమెరాలు నిర్వహించాలి. రుషికొండ బీచ్ ఈత కొట్టడం, వాటర్ స్కీయింగ్, విండ్ సర్ఫింగ్ వంటి ఆటలు ఆడుకోవడానికి అనువైన ప్రదేశం. అదనంగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఈ బీచ్ చుట్టూ కుటీరాలు, రెస్టారెంట్లు, ఇతర సౌకర్యాలతో పాటు ఆకర్షణీయమైన పర్యాటక ప్రదేశంగా మార్చింది. అంతేకాకుండా డైవింగ్, సముద్ర కయాకింగ్, పారామోటరింగ్, స్పీడ్ బోటింగ్, జెట్ స్కీ, వంటి ఎన్నో వినోదాత్మకమైన ఆటలు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. బీచ్ నీటిలో పర్యాటకులు నీటి క్రీడలను ఆస్వాదించవచ్చు

# దారి ఖర్చులు రావడం లేదు

కర్నూలు, నవంబర్ 16, దారిఖర్చులు కూడా రావడం లేదంటూ టమోటా రైతులు విలవిలలాడుతున్నారు. రైతులకు కిలో టమోటాకు రెండు రూపాయలలోపే ధర లభిస్తోంది. కనీసం కూలి, రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో ఆరుబయట పారబోసేసి రైతులు తమ నిరసన తెలుపుతున్నారు. పది రోజుల నుంచి టమోటా ధర దారుణంగా పడిపోతూ వచ్చింది శనివారం ఒక గంప (15 కిలోలు)కు రూ.25 ధర మాత్రమే లభించింది. దీంతో, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎకరా విస్తీర్ణంలో టమోటా సాగుకు రూ.50 వేల పెట్టుబడి అవుతోంది. ఎకరాకు ఎనిమిది నుంచి పది టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ఇప్పటి ధర ప్రకారం రూ.15 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదు. 2010 సంవత్సరం కంటే ముందు ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 20 వేల ఎకరాల్లో టమోటాను సాగు చేసేవారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నాటు రకమైన టమోటా పండించేవారు. రాష్ట్రంలోని మదనపల్లి, అనంతపురం, కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి తదితర ప్రాంతాల్లో హైబ్రిడ్ రకం టమోటా సాగు చేయడంతో ఎక్కువ దిగుబడితోపాటు నాణ్యమైన పంట వస్తోంది. నాటు టమోటాకు డిమాండ్ కరువవడంతో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గింది. ఆ తర్వాత ఇక్కడి వారు కూడా హైబ్రిడ్ రకం టమోటా సాగు ప్రారంభించారు. దీంతో, క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. కర్నూలు జిల్లాలోని ఆదోని, ఆస్పరి, పత్తికొండ, ప్యాపిలి, డోన్ ప్రాంతాల్లో ఈ ఏడాది దాదాపు 7,500 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఆ సమయంలో ధరలు పెరిగాయి. ప్రస్తుతం కొన్ని రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో దిగుబడులు పెరుగుతున్నాయి. జిల్లాలోని మార్కెట్ల ద్వారా రోజుకు 20 లారీలకుపైగా టమోటాను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాదు, సికింద్రాబాద్ మార్కెట్లకు తరలించి కిలో రూ.20కుపైగా విక్రయించి లాభపడుతున్నారు. పత్తికొండ మార్కెట్లో అత్యధికంగా టమోటా క్రయవిక్రయాలు సాగుతున్నాయి. ఆ మార్కెట్‌లో గతేడాది 730 టన్నుల టమోటా విక్రయాలు జరిగాయి. ప్రస్తుత ఏడాది ఇప్పటి వరకూ 320 టన్నుల టమోటా విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. శనివారం 2.79 టన్నుల క్వింటాళ్లుఅమ్ముడయ్యాయి. రోజుకు సరాసరి మూడు టన్నుల చొప్పున సరుకు వస్తోంది. రెండు రోజుల క్రితం వరకూ కిలో టమోటాకు రెండు రూపాయల ధర లభించేది. ప్రస్తుతం అంతకంటే ధర తగ్గిపోయింది. కనీసం కూలి, రవాణా ఛార్జీలు కూడా రాకపోవడంతో కొందరు రైతులు టమోటాలను పత్తికొండ మార్కెట్‌లోనే పారబోసి వెళ్లిపోతున్నారు. ఎకరా విస్తీర్ణంలో టమోటా సాగు చేశాను. రూ.50 వేల వరకూ పెట్టుబడి అయింది. 19 గంపల టమోటాను మార్కెట్‌కు తీసుకెళ్లాను. ఒక్కో గంపకు రూ.25 మాత్రమే ధర లభించింది. పెట్టుబడిమాట అటుంచి కనీసం రవాణా ఛార్జి, టమోటాను ఏరించడానికి అయిన కూలీల ఖర్చులు కూడా రాలేదు.

# కడప జిల్లాల్లోనే పునాదుల్లో పునరావాసం

కడప, నవంబర్ 16, అన్నమయ్య' నిర్వాసితుల పునరావాసం పునాదులకే పరిమితమైంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇస్తామని సిఎం జగన్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. కొంతమంది నిర్వాసితులు అప్పులు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మించినా పార్ట్ బిల్లులు విడుదల కాలేదు. ఇసుక దిబ్బలు తొలగించకపోవడంతో పంట సాగు లేక నిర్వాసితులు పట్టణాలకు వలసపోతున్నారు. 2021 నవంబర్ 19 తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా రాజంపేట మండలంలోని అన్నమయ్య రిజర్వాయర్ తెగిపోవడంతో పులపత్తూరు, మందపల్లి, రామచంద్రాపురం, గుండ్లూరు, తోగూరుపేట, శేషమాంబపురం గ్రామాలను వరద ముంచెత్తిన విషయం విదితమే. 39 మంది చనిపోయారు. వందలాది ఇళ్లు కూలిపోయాయి. వేలాది పశుసంపద గల్లంతైంది. సర్వం కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ మేరకు 436 మందికి ఐదు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇంటి నిర్మాణానికి ఐదులక్షల చొప్పున కేటాయిస్తామని జారీ చేసిన జిఒ ఫైనాన్స్‌లో పెండింగ్ ఉంది. ఈ ఏడాది నవంబర్ 19 నాటికి ఏడాది పూర్తవుతున్నా ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగలేదు. 436 ఇళ్ల స్థలాల్లో 180 మంది రూ.150 లక్షల వరకు అప్పులు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్నారు. పార్ట్‌బిల్లు సైతం విడుదల చేయకపోవడంతో వడ్డీల చెల్లింపునకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. నిర్వాసిత గ్రామాల్లోని సుమారు 1000 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. పలుమార్లు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ మందపల్లి మినహా పుల పుత్తూరు తదితర గ్రామాల్లో జెసిబిలతో ఇసుకను కుప్పలుగా పోశారు. ఇసుక తరలింపును మరిచారు. దీంతో సాగుకు అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా కుటుంబ జీవనం దుర్భరంగా మారింది.

## రెండున్నర ఏళ్లలో పూర్తికానున్న బందరు పోర్టు

విజయవాడ, నవంబర్ 16, బందరు పోర్టు నిర్మాణం దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. తాజాగా పోర్టు నిర్మాణానికి ఎపి మారిటైం బోర్డుతో మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఒప్పందం చేసుకుంది. దీంతో ఒకటి, రెండు నెలల్లోనే పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉందని సమాచారం. ఈ దిశలోకసరత్తు వేగంగా జరుగుతోంది. నవయుగ సంస్థతో గతంలో చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం, దీనిపై జరిగిన న్యాయ వివాదంలో ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇవ్వడం తదితర పరిణామలు తెలిసిందే. మెగాతో ఒప్పందం ఖరారు కావడంతో పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎపిసిజడ్ఎంఎ) ఇటీవల పరిశీలించింది. ఆ సంస్థ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర పర్యావరణ శాఖ అనుమతుల కోసం మారిటైం బోర్డు కసరత్తు చేస్తోంది. పర్యావరణ ప్రభావ అంచనాపై ఎపి కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసింది. మత్స్యకారుల జీవనోపాధికి సమస్యలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ పోర్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో, నవంబర్ నెలాఖరులోపు కేంద్రం అనుమతులు లభిస్తాయని మారిటైం బోర్డు అధికారులు చెప్తున్నారు. అనంతరం భూమి పూజ చేసి పనులు ప్రారంభించే అవకాశం ఉందని అంటున్నాయి. బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమకూర్చుకోవడానికి మారిటైం బోర్డు ప్రయత్నాలు ప్రారంభించింది.మొదటి దశలో పోర్టుకు సంబంధించి నాలుగు బెర్తులు నిర్మించాల్సి ఉంది. ఇందుకుగానూ ఎపి మారిటైం బోర్డు రూ.5,155.73 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. రూ.3,668.83 కోట్లతో మెగా ఇంజినీరింగ్ సంస్థ టెండరు దాఖలు చేసి ఎల్ వన్‌గా నిలిచింది. ఈ సంస్థతో మారిటైం బోర్డు ఒప్పందాన్ని పూర్తి చేసుకుంది. కేంద్ర పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత కాంట్రాక్టు సంస్థకు డేట్ ఆఫ్ కమెన్స్‌మెంట్ (నిర్మాణ కాల పరిమితి)పై లెటర్‌ను మారిటైం బోర్డు ఇవ్వనుంది. ఒప్పందం ప్రకారం భూమి పూజ తర్వాత 30 నెలల వ్యవధిలో కాంట్రాక్టు సంస్థ నిర్మాణం పూర్తి చేయాలి.బందరు పోర్టు నిర్మాణం ఎన్నో మలుపులు తిరుగుతోంది. పోర్టు నిర్మాణం పూర్తయితే వ్యవసాయ రంగానికే పరిమితమైన ఉమ్మడి కృష్ణా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికీ అవకాశాలు ఏర్పడతాయని, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2008లో పోర్టు నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్న మైటాస్ సంస్థ రూ.100 కోట్లకుపైగా బ్యాంకు రుణాలు తీసుకుంది. నిర్మాణ పనులు ప్రారంభించకుం డానే ఆర్థికంగా మునిగిపోయింది. ఆ తర్వాత పిపిపి పద్ధతిలో నిర్మాణానికి నవయుగ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పనులను ప్రారంభించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కొద్ది రోజులకే ఆ ఒప్పందాన్ని రద్దు చేసింది. తాజాగా ఇపిసి పద్ధతిలో నిర్మాణానికి మారిటైం బోర్డు ద్వారా టెండర్లు ఆహ్వానించింది. మెగా ఇంజినీరింగ్ సంస్థతో ఒప్పందం చేసుకుంది.

## టీడీపీతో కలిసి పోటీకి పవన్



విశాఖపట్టణం, నవంబర్ 16, ఇటీవల ప్రధాని మోదీతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేటీ అయిన విషయం తెలిసిందే..విశాఖ పర్యటనకు వచ్చిన మోదీ..అనూహ్యంగా కలవాలని చెప్పి పవన్‌కు ఆహ్వానం ఇచ్చారు. దీంతో పవన్..మోదీని కలిశారు. ఇక ఏకాంతంగా సాగిన భేటీలో వారిద్దరి మధ్య ఏం చర్చకు వచ్చిందనేది ఎవరికి తెలియదు. కానీ మీడియా మాత్రం ఎవరికి వారు నచ్చిన కథనాలు వేసుకుంటున్నారు.ఇక పవన్ సైతం..ఏపీలో ఉన్న పరిస్తితులని వివరించానని, ఏపీ అభివృద్ధికి మోదీ కట్టుబడి ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇంకా అంతే అసలు మ్యాటర్ ఏంటి అనేది బయటకు రాలేదు. అయితే మోదీతో పవన్ భేటీ అవ్వడంపై టీడీపీ వర్షన్ వచ్చి..జగన్ అరాచక పాలన గురించి చెప్పి ఉంటారని, ఇక ప్రభుత్వాలు వేరు, పార్టీలు వేరు అని మోదీ చెప్పారని, ఇంకా జగన్ ప్రభుత్వంపై యుద్ధమే అని ప్రకటించారని టిడిపి వర్షన్ ఉంది.వైసీపీ వర్షన్ వచ్చి మోదీతో భేటీ తర్వాత..పవన్ దూకుడు తగ్గిందని, తమ ప్రభుత్వాన్ని ఎక్కువ తిట్టడం లేదని, అలాగే టీడీపీ మోసకారి పార్టీ అని, ఆ పార్టీతో పొత్తు ఉండదని మోదీ తేల్చి చెప్పేశారని అంటున్నారు. అంటే ఎవరి వర్షన్ వారికి ఉంది..కానీ అసలు నిజం ఏంటి అనేది తెలియడం లేదు. అయితే వైసీపీని గద్దె దించడానికి పవన్ టీడీపీతో కలవడం ఖాయమని అంటున్నారు. అందుకు బిజేపి మాత్రం ఒప్పుకోవడం లేదని తెలుస్తోంది. టిడిపితో కలవడానికి బిజేపి ఇష్టపడటం లేదు.పవన్ మాత్రం టిడిపితో ముందుకెళ్లాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కేంద్రం సపోర్ట్ కూడా ఉ ంటే బాగుంటుందని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ పొత్తుల విషయం ఏ మాత్రం క్లారిటీ రావడం లేదు. ప్రస్తుతానికి ఎవరికి వారు సెపరేట్ గా ఉన్నారు. ఆఖరిగా పొత్తులో ఉన్న జనసేన-బీజేపీలు సైతం సెపరేట్‌గా రాజకీయం చేస్తున్నాయి. మరి చివరికి ఎవరు ఎవరితో కలుస్తారో చూడాలి. అలాగే కేంద్రం మద్దతు ఎవరికి ఉంటుందో చూడాలి.

## ఆగివున్న లారీని ఢీకొన్న ఆటో

### నలుగురు మృతి

కాకినాడ కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మల్లేపల్లి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని టాటా మ్యాజిక్ ఆటో ఢీకొంది. ఘటనలో నలుగురు మృతి చెందగా , మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అ?యాయి. తాడేపల్లిగూడెం నుండి వైజాగ్ వెళుతుండగా ప్రమాదం జరిగింది. మృతులు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణ పురానికి చెందిన వారిగా గుర్తించారు.

ఈ ప్రమాదంలో టాటా మ్యాజిక్ లో ప్రయాణిస్తున్న 13 మందికి గాను ఒకరు ప్రమాద సంఘటనా స్థలంలో అక్కడికక్కడే మృతి చెందగా... మరో ముగ్గురు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా మిగిలినవారు స్వల్ప గాయాలతో అసుపత్రి పాలయ్యారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కడపలో పట్టు కోసం ప్రయత్నం

కడప, నవంబర్ 16, కడప జిల్లా అంటేనే కాంగ్రెస్ పార్టీకి కంచుకోట లాంటిది. పులివెందుల లాంటి నియోజకవర్గంలో పార్టీలతో సంబంధం లేకుండా వైఎస్ కుటుంబీకులకు పెద్దపీట వేస్తారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓటుబ్యాంకు వైసీపీవైపు మళ్లించింది. 2014, 2019 ఎన్నికల్లో తన దూకుడును వైసీపీ ప్రదర్శించింది.2014లో టీడీపీ రాజంపేటను దక్కించుకోగలిగింది. 2019లో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది.2019 ఎన్నికల తర్వాత టీడీపీ నేతలు పలువురు బీజేపీ చెంతకు చేరారు. సీఎం రమేష్, ఆది నారాయణరెడ్డి వంటివారు బీజేపీలో ఉన్నారు. తాజాగా కడప జిల్లాపై చేయించిన సర్వేలో అధికార పార్టీపై వ్యతిరేకత స్పష్టంగా కనపడుతోందని చంద్రబాబు పార్టీ నాయకులకు తెలిపారు. రాజంపేట, రైల్వేకోడూరు, కడప, బద్వేలు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ ఆధిపత్యం చూపిస్తోందని, రానున్న ఎన్నికల్లో ఈ నాలుగు సీట్లు పార్టీ ఖాతాలో పడాలని లక్ష్యాన్ని నిర్ధేశించారు.బద్వేలులో జరిగిన ఉప ఎన్నికలో డాక్టర్ సుధ విజయం సాధించారు. తన భర్త మరణంతో వచ్చిన ఉప ఎన్నికలో పోటీచేసి గెలుపొందారు. అయితే ఆమె ప్రజలకు చేరువకాలేకపోతోందని టీడీపీ సర్వేలో తేలింది. ప్రభుత్వంలోని కొందరు కీలక నాయకులు చెప్పిందే జరుగుతోందని, ఈ పరిణామాలన్నీ టీడీపీకి కలిసివస్తాయని చంద్రబాబు నేతలకు సూచించారు. కడప నియోజకవర్గమంటేనే కాంగ్రెస్ కు, ఆ తర్వాత వైసీపీకి పెట్టని కోట. అయితే ఇక్కడ రెండుసార్లు గెలిచిన అంజాద్ బాషా మంత్రి పదవి దక్కించుకున్నప్పటికీ ఆయన వైసీపీ ఆశించిన రీతిలో పనిచేయలేకపోతున్నారని ఆ పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇది తెలుగుదేశంకు సానుకూలంగా మారుతోందని చంద్రబాబు విశ్లేషించారు.జిల్లాలను ఏర్పాటు చేయడానికి ముందే రాజంపేటలో వైసీపీపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అన్నమయ్య జిల్లా కేంద్రంగా మార్చాలంటూ ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అది పార్టీకి వ్యతిరేకంగా మారింది. తమ అభ్యర్థిని గెలిపిస్తే రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామని టీడీపీ ప్రకటించడంతో అక్కడ అనుకూల వాతావరణం ఏర్పడిందని విశ్లేషించారు. రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గంలో వైసీపీ తరఫున గెలిచిన కొరుముట్ల శ్రీనివాస్ పై అక్కడిప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, మంత్రి పదవి ఆశించినప్పటికీ అది దక్కకపోవడంతో ఆయన కూడా నియోజకవర్గంలో చురుగ్గా పర్యటించడంలేదు. ఇవన్నీ పార్టీకి ప్లస్సవుతాయని చెప్పారు. మైదుకూరు నియోజకవర్గంలో టీడీపీ వరుస పరాజయాలు చవిచూస్తున్నప్పటికీ పార్టీలోకి డీఎల్ రవీంద్రారెడ్డిని తీసుకొని టికెట్ ఇచ్చే విషయమై సర్వే నిర్వహించగా మెజారిటీ ప్రజలు డీఎల్ కు జై కొట్టారు. ఈ విషయం పార్టీకి సానుకూలంగా మారిందన్నారు. రానున్న ఎన్నికల్లో గట్టి పట్టును సంపాదించి వ్యూహాత్మకంగా చక్రం తిప్పాలని బాబు నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

# నేడు హిందూ టైగర్, శివసేన పార్టీ వ్యవస్థాపకుడు బాల్ థాకరే వర్ధంతి



దాదాపు ఐదు దశాబ్దాల పాటు మహారాష్ట్ర రాజకీయాలలో కాకుండా దేశ రాజకీయాలను సైతం ప్రభావితం చేసిన విలక్షణ వ్యక్తి బాల్ థాకరే. ఠాక్రే 23 జనవరి 1926న పూణేలో కేశవ్ సీతారాం ఠాక్రే అతని భార్య రమాబాయి ఠాక్రేల కుమారుడిగా జన్మించారు. బాల్ థాకరే ఎనిమిది మంది తోబుట్టువులలో పెద్దవాడు,1950లలో రాజకీయ వ్యంగచిత్రకారుడిగా (కార్టూనిస్టుగా) జీవనం ప్రారంభించిన థాకరే 1960 నాటికి సొంత రాజకీయ వారపత్రికను ప్రారంభించాడు. ముంబాయిలో మహారాష్ట్రేతరుల ఆధిపత్యాన్ని సహించక వారికి వ్యతిరేకంగా కార్టూన్లు వేసేవాడు. ఆ తర్వాత మరాఠా ప్రజల హక్కుల సాధనకై పోరాటం చేయడానికి 1966లో శివసేన పార్టీకి ఏర్పాటుచేశాడు. "మహారాష్ట్ర మహారాష్ట్రీయులకే' అనే ఉద్యమంలో భాగంగా ముంబాయిని వదిలిపోవాలని ప్రవాసులను హెచ్చరించాడు. హిందుత్వను, హిందూ జాతీయవాదాన్ని కూడా బలపర్చాడు. జాతీయ రాజకీయాలలో భారతీయ జనతా పార్టీతో జతకట్టి కీలక పాత్ర వహించాడు. శివసేన పార్టీ స్థాపించిననూ 1995లో మహారాష్ట్రలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిననూ బాల్ థాకరే మాత్రం ప్రత్యక్ష రాజకీయాలలోకి రాలేదు, ఎన్నికలలో పోటీచేయలేదు. పార్టీ అధినేతగానే ఉంటూ పార్టీని నడిపించాడు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడానికి కూడా వెనుకంజ వేయలేదు.86 ఏళ్ళ వయస్సులో నవంబర్ 17, 2012న ముంబాయిలోని తన నివాసం మాతోశ్రీలో మరణించాడు.థాకరే స్థాపించిన ఆంగ్ల పత్రిక సామ్నా, హిందీ పత్రిక దోపహార్ సామ్నాలు సంతాపం ప్రకటించాయి. జాకెట్ పేజీలు, కవర్ పేజీలు కూడా పూర్తి నలుపులో ప్రచురించి ఆ పత్రికలు తమ విచారాన్ని వ్యక్తం చేశాయి. రెండు కవర్ పేజీలు పూర్తి నలుపు రంగులో ప్రచురించడం పత్రిక చరిత్రలో ఇదే తొలిసారి.శివసేన అధినేత బాల్ థాకరే మృతదేహానికి సాయంత్రం ఆరు గంటలకు (నవంబర్ 17) దహన సంస్కారాలు జరిగినవి. సందర్శన కోసం శివాజీ పార్కులో థాకరే మృతదేహాన్ని ఉంచారు. అభిమానుల తాకిడితో శివాజీ పార్కు కిక్కిరిసి పోయింది. ముంబయి రోడ్లు కూడా జనసంద్రమయ్యాయి. 1966లో శివసేన ఆవిర్భావం సందర్భంగా సరిగ్గా బాల్ ఠాక్రే ప్రసంగించిన చోటే ఆయన చితిని ఏర్పాటు చేశారు. దసరా ఉత్సవాల్లో కూడా ఠాక్రే ఇక్కడి నుంచే ప్రసంగించేవారు. ముంబై పోలీసులు 21 తుపాకులు పేల్చి గౌరవ వందనం సమర్పించారు. ఠాక్రే భౌతికకాయం వద్ద మహారాష్ట్ర గవర్నర్ కె.శంకరనారాయణన్, ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించారు. ఎలాంటి అధికార పదవీ చేపట్టని ఠాక్రేకు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం విశేషం. మహారాష్ట్ర ప్రజలను కొన్ని దశాబ్దాల పాటు ప్రభావితం చేసినందుకు గౌరవంగా ప్రభుత్వం అధికార లాంఛనాలతో ఠాక్రేకు వీడ్కోలు పలికింది. గతంలో ఎన్నడూ బహిరంగ అంత్యక్రియలు జరగని శివాజీ పార్కులో ఠాక్రే అంత్యక్రియలకు అనుమతిచ్చింది. ముంబైలో 1920లో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ అంత్యక్రియల తర్వాత బహిరంగ అంత్యక్రియలు జరగడం ఇదే తొలిసారి! శివాజీ పార్కుకు భారతీయ జనతా పార్టీ జాతీయ నేతలు లాల్ కృష్ణ అద్వానీ, అధ్యక్షుడు నితిన్ గడ్కరీ, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్, మేనకా గాంధీ తదితరులు చేరుకున్నారు. 20 లక్షల మందికి పైగా పాల్గొన్న ఠాక్రే అంతిమయాత్ర, అంత్యక్రియలు జనసంద్రాన్ని తలపించింది. గత ఐదు దశాబ్దాల కాలంలో దేశంలో ఒక నేత అంత్యక్రియల్లో ఇంతమంది పాల్గొనడం ఇదే తొలిసారి అని భావిస్తున్నారు.

# ఎంతమందికి పంట బీమా ఇచ్చారు

విజయవాడ రాష్ట్ర పార్టీ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చ జరిగింది. 26 జిల్లాల్లో జనరల్ బాడీ సమావేశాలు జరగనున్నాయి. దేశ, రాష్ట్ర పరిస్తితులను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లడనికి సమావేశాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని రాష్ట్ర పర్యటనను వైకాపా విజయవంతం చేసింది. మోడీ పర్యటనలో ఒక్క అంశాన్ని కూడా రాష్ట్రానికి సంబంధించి ప్రస్తావన రాలేదు. రాష్ట్ర ప్రయోజనాలపై కనీసం స్పందన లేదు ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వాటి ప్రస్తావన లేదు. కనీసం ముఖ్యమంత్రి పేరు కూడా ప్రస్తావనకు రాలేదు. తెలంగాణలో సింగరేణి ప్రైవేట్ చేయడం లేదు ,దుష్ప్రచారం జరుగుతుంది అని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారంపై అలాంటి స్పష్టమైన ప్రకటన ఎందుకు చేయలేదు. విశాఖ రైల్వే జోన్ అంశం కూడా మాట్లాడలేదు. ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీ లో నిరసనకు మద్దతు ఇస్తున్నామని అన్నారు. విభజన హామీల్లో కడపలో ఉక్కు కర్మాగారం కి మూడు సార్లు శంకుస్థాపన చేశారు. ఉక్కు కర్మాగారం నిర్మించాలని డిసెంబర్ 9వ తేదీ నుంచి 5 రోజులు పాటు నిరసన కార్యక్రమాలు చేపడతాం. జగనన్న కాలనీ ల్లో ఇల్లు నిర్మించుకోవడానికి ఇసుక దొరకడం లేదు అని మంత్రి ముందే చెప్పారు. లక్షా ఇరవై వెలతో ఇల్లు ఎలా కడతారో చెప్పాలి .

ఇంటి నిర్మాణానికి కనీసం 5 లక్షలు ఇవ్వాలి. ఇళ్ల నిర్మాణానికి కేంద్రమే డబ్బులు ఇస్తుంది. డిసెంబర్ 5 నుంచి ఇంటి సమస్యలపై నిరసనలు చేపడతాం. రాష్ట్రంలో రైతులు బీమా రాని వారు తిరిగి అప్లై చేసుకోవాలని సీఎం చెప్పారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అసలు బాగోలేదు,ఎంతమందికి పంట బీమా ఇచ్చారో చెప్పలేదు. వాస్తవాలు అన్ని దాచేసి ,భీమా రాని వారికి ఇవ్వడం లేదని అయన అన్నారు.

# బిశ్రీబాగ్ ఒడంబడిక సీమకు ప్రాణం : ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి"

నవోంబర్ 16-న ఎమ్మిగనూరు: పట్టణంలో మన ప్రియతమ నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారి ఆధ్వర్యంలో మండల ఆఫీసు నుండి ర్యాలీగా వెలుతు గాంధీ చౌక్, షరఫ్ బజార్, శ్రీనివాస టాకిస్, ట్యాంక్ బండ్, సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా బయలు దేరి, ప్లకార్డులను చేతబట్టీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు మాట్లాడుతూ విపక్ష... ఆర్థిక వ్యత్యాసాలను 85 ఏళ్ల క్రితమే శ్రీబాగ్ ఒడంబడిక (ఒప్పందం) ఎలుగెత్తి చాటింది. సీమలోని తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పాటు ఇక్కడి ప్రజలు రాజధాని లేదా హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరితే దానిని నిర్మించాలని 1937 నవంబర్ 16న రాయలసీమ, కోస్తాంధ్ర పెద్ద మనుషుల మధ్య ఒప్పందం కుదిరింది, కానీ దానిని పాలకులు తొక్కిపెట్టి తమ రాజకీయ స్వార్ధంతో పబ్బం గడుపు కోవడంతో రాయలేలిన రతనాల సీమలో ప్రజలు నేటికీ దుర్భర జీవితం గడపుతున్నారు. 1956 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, 2014లో ఏపీ నుంచి తెలంగాణ విడిపోయిన సందర్భాల్లో పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం సీమలో హైకోర్టు లేదా రాజధాని ని ఏర్పాటు చేయాలని కోరినా పాలకులు పట్టించుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీబాగ్ ఒడంబడిక కు ప్రాణం పోస్తున్నారు. ప్రతిపక్షాలు స్వార్థపూరిత ఆలోచనల పై ప్రజలే ఉద్యమిస్తున్నారు. న్యాయ రాజధాని సీమకు కావాల్సిందేనని పట్టుబడు తున్నారని అన్నారు.×ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్ రఘు, వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్, మైనార్టీ నాయకులు రియాజ్ ఆహ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, ప్రధాన కార్యదర్శి యూకె. వీరెంద్ర, కోశాధికారి తారా రాజశేఖర్, అధికార ప్రతినిధి కె. సునీల్ కుమార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్, కో ఆపరేటివ్ స్టోర్ చైర్మన్ షబ్బీర్ ఆహ్మద్, నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, ఇన్ చార్జ్ లు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఒకే కుటుంబంలోని ముగ్గురు ఆత్మహత్య ప్రయత్నం

### ఇద్దరు మృతి? పోలీసు వేధించపులని ఆరోపణ

అనంతపురం పోలీసుల వేధింపులతోనే తన కుటుంబంలోని ముగ్గురు సభ్యులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తల్లి షేకున్ బీ,సోదరుడు మన్సూర్ భాషలు మృతి చెందినట్లు బాధితుడు మహబూబ్ భాషా ఆరోపించాడు.అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామంలో కనేకల్ హెడ్ కానిస్టేబుల్ రఘునాథ్ రెడ్డి వేధింపుల కారణంగా తన తల్లి షేకున్ బీ, తండ్రి సలీమ్ భాషా సోదరుడు మన్సుర్ భాష లు పురుగుల మందు తాగి ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యుడు మహబూబ్ బాషా తెలిపాడు.మూడేళ్ల క్రితం కనేకల్ కు చెందిన హసీనాబానుతో తన సోదరుడు మన్సూర్ భాషకు వివాహమైందని తెలిపాడు.ఇటీవల కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా గొడవలు జరిగాయని తెలిపాడు.తల్లి,తండ్రి,సోదరుని పై కనేకల్ పోలీస్ స్టేషన్లో తన వదిన హసీనా బాను ఫిర్యాదు చేసిందని తెలిపాడు. అయితే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఇంటికి వచ్చి చిత్రహింసలకు గురి చేయడంతో పాటు బెదిరించి తన సోదరునిపై చేయి చేసుకున్నట్లు తెలిపాడు. దీంతో పోలీసుల వేధింపులు తాళ్ళలేక ఇంట్లో పురుగుల మందు తాగి ముగ్గురు ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించారని వాపోయాడు.మెరుగైన వైద్యం కోసం వారిని బళ్లారి విమ్స్ కు తరలించినట్లు తెలిపాడు. చికిత్స పొందుతూ పరిమి పరిస్థితి విషమించి సోదరుడు మన్సూర్ భాష, తల్లి షేకున్ బీ లు మృతి చెందినట్లు వాపోయాడు.

## కానిస్టేబుల్ ఓవరక్షన్ వల్లే కుటుంబం బలి మాజీ మంత్రి

అనంతపురం హెడ్ కానిస్టేబుల్ రఘునాథ్ రెడ్డి వేధింపులతో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు కాలు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామంలోహెడ్ కానిస్టేబుల్ రఘునాథ్ రెడ్డి వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందిన తల్లి షేకున్ బీ, కుమారుడు మన్సూర్ భాష కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కాల్వశ్రీనివాసులుపరామర్శించారు. కర్ణాటక ప్రాంతమైన బళ్లారి విమ్స్ లో మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.మైనార్టీ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు.సమాజంలో బాధ్యులైన పౌరులుగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.ఇద్దరి మృతి, మరొక పరిస్థితి విషమంగా ఉండడానికి కారకుడైన హెడ్ కానిస్టేబుల్ రఘునాథ రెడ్డి పై చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు.జిల్లా ఎస్పీ స్పందించకపోతే బాధిత కుటుంబాన్ని న్యాయం చేసేందుకు ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరికలు చేశారు.పోలీసు ఉ న్నతాధికారులు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించి ముస్లిం మైనారిటీ బాధిత కుటుంబానికి రూ. 25 లక్షలు ఆర్థిక సహాయం అందించే ఆదుకోవాలని కోరారు.

## అవార్డు గ్రహీత కు సన్మానం.....

కమాన్ పూర్ బహుజన సాహిత్య అకాడమీ వారిచే బెస్ట్ ఉమెన్ లీడర్షిప్ అవార్డు గ్రహీత భూపెల్లి జ్యోతి నీ పలువురు ఘనంగా సన్మానించారు. ఈనెల 13న ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా బహుజన సాహిత్య అకాడమీ నుండి ఈ అవార్డును ఎంపికై అందుకున్నారు. అవార్డు గ్రహీత కమాన్ పూర్ మండలం దాసరి పల్లెకు వచ్చిన సందర్భంగా యువత జ్యోతి ని భూపతి మల్లేష్ నుశాలువాతో ఘనంగా సన్మానించారు. మరింత పైకి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజేష్ ( లడ్డు) పృథ్వి రాజ్ కొప్పుల రాజేష్ రామ్ షాన్ మోహనకృష్ణ అభిషేక్ సురేష్ శేఖర్ రమేష్ చింటూ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం జగద్గురువుల పాదయాత్రను జయప్రదంచేయండి

### జిల్లా అర్చక సమాఖ్య సంఘం సభ్యులకు సన్మానం

మంత్రాలయం శ్రీశైలం జగద్గురుల పాదయాత్రను జయప్రదం చేయండి అంటూ కర్నూలు జిల్లా జంగం అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు జంగం .లాల్ బహుదూర్ శాస్త్రి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు జంగం సుజాత శంకర్ లు తెలిపారు.,మంత్రాలయం రామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య తరఫున నూతనంగా కర్నూలు జిల్లాకు ఎన్నుకోబడిన జిల్లా కమిటీ సభ్యులు, మంత్రాలయం చెందిన సూర్యనారాయణచార్యులను చిట్యాల బసవరాజు లను , శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అర్చకులు సన్మానించారు. కర్నూలు జిల్లాలోని అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని జిల్లా అర్చక సమాఖ్య కమిటీ సభ్యులు సూర్యనారాయణ చార్యులు, బసవరాజులు తెలిపారు. కర్నూలు జిల్లా అర్చక సమాఖ్య తరుపున జిల్లా కమిటీలో మమ్మల్ని భాగస్వామ్యం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకి, కమిషనర్ హరి జవహర్ లాల్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య పెద్దలు పెద్దింటి రాంబాబు, ఆత్రేయ బాబు, కోటపాడు శ్రీనివాసాచార్యులు, గుమ్మరాల నరసింహయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు వీరు రామలింగేశ్వర స్వామికి విశేషాలు పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రామలింగేశ్వర స్వామి అర్చకులు చంద్రశేఖర్ స్వామి, ఎల్లా లింగస్వామి, రుద్రయ్య స్వామి, సిద్ధ లింగయ్య స్వామి, వీరభద్రయ్య స్వామి, చిన్న శంకరయ్య స్వామి, మునేష్ ఆచారి, భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్ల పై ఉక్కు పాదం



నంద్యాల:- నంద్యాల పట్టణంలో అక్రమ వెంచర్ల పై మున్సిపల్ అధికారులు ఉక్కు పాదం మోపినట్లు తెలుస్తోంది. బుధవారం నాడు శిల్పా నగర సమీపంలోని భూమా రాఘవ రెడ్డి వెంచర్ సమీపంలో వక్ఫ్ బోర్డు భూములు కబ్జాగు గురి అవుతున్నాయని గత వారంలో వివిధ పత్రికల యందు వచ్చిన వార్తలకు స్పందించి గత రెండు మూడు రోజుల నుండి క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ చేపట్టారని తెలుస్తోంది. మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి. రెవెన్యూ అధికారి వర ప్రసాద్. మున్సిపల్ సర్వేయర్. 22 వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు .

## 40 లక్షల రూపాయలతో విద్యానగర్లో పార్కు ప్రారంభించిన ఎమ్మెల్యే. ఎమ్మెల్సీ,

నంద్యాల - నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 24 వ వార్డు విద్యానగర్లో సర్వేపల్లి రాధాకృష్ణ పార్కు ఉండేదని తాగుబోతులకు అడ్డగా మారి ప్రజలకు ఇబ్బందికరంగా ఉండడంతో 2019 ఎలక్షన్లలో నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రజల అభ్యర్థన మేరకు పార్కును సందర్శించి నూతన హంగులతో పార్క్ ను నిర్మిస్తారని మాట ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం నేడు సుందరీకరణలో భాగంగా పార్కును ఎంతో సుందరంగా తీర్చిదిద్ది నేడు ఎమ్మెల్యే. ఎమ్మెల్సీ ఇరువురు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని విద్యానగర్లో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ పార్కు సుందరీకరణలో భాగంగా 40 లక్షల రూపాయలతో ప్రారంభించడం ఎంతో సంతోషకరంగా ఉందని చుట్టుపక్కల ఉన్న ప్రజలు పిల్లలు కు పార్కు లో ఆహ్లాదకరంగా ఉండేవిధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే నంద్యాల పట్టణంలో లలితా నగర్ లో కూడా పార్క్ ను ప్రారంభించడం జరిగిందని సంజీవ్ నగర్ ,ఎన్జీవోస్ కాలనీ, చెరువు కట్టపై వాటి అన్నింటిని సుందరి కరుణంలో భాగంగా దసలివారీగా పూర్తి చేయడం జరుగుతుందని నంద్యాల పట్టణాన్ని సుందరీకరణ చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలియజేశారు... ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాభున్నిసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ,మున్సిపల్ వైస్ చైర్మన్ లు గంగిశెట్టి శ్రీధర్ ,పామ్ షావలి, వార్డ్ కౌన్సిలర్ షహనాజ్, కో ఆప్షన్ సభ్యురాలు శోభారాణి, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, శశికల రెడ్డి, వైసీపీ కౌన్సిలర్స్ కృష్ణమోహన్, చంద్రశేఖర్, తమీమ్, మరియు వైఎస్ఆర్సిపి మాజీ కౌన్సిలర్స్ వార్డు ఇన్చార్జిలు వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ రుణాలు ఇంకెప్పుడు. ...డి హెచ్ పి ఎస్



### జిల్లా ఉపాధ్యక్షుడు పి వెంకటరమణ...

బద్వేలు ఎస్టి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి దళిత వ్యతిరేకంగా భావించవలసి వస్తుందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పి వెంకటరమణ పేర్కొన్నాడు. బుధవారం నాడు పోరుమాల పట్టణంలో పత్రిక సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసం బ్యాంకు ల నుండి ప్రభుత్వ రుణాలు పొందూరు చేసి వారికి బాసటగా నిలిచేందుకు ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఇంతకు ముందున్న ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేసి వారి అభివృద్ధికి పాటుపడితే ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎస్ఎస్సి రుణాలను మంజూరు చేయకుండా వారి అభివృద్ధికి ఆటంకం కలిగించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. దళిత గిరిజన ఓట్లతో గద్దెనెక్కి దళితుల పక్షాన వాళ్ళ అభివృద్ధి కోసం నేను పాటుపడతానని నమ్మబలికి ఇప్పుడు వాళ్ళ అభివృద్ధికి కారకమయ్యే రుణాలను మంజూరు చేయకపోవడం ఎంతవరకు సబబు అని ఆయన అన్నాడు. ఇప్పటికైనా సీఎం జగన్మోహన్ రెడ్డి ఎస్సీ ఎస్టీ రుణాలను మంజూరు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాలని లేనిపక్షంలో 2024 లో ఒక్క దళిత గిరిజన ఓట్లు వేయమని ఆయన హెచ్చరించాడు. ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రపల్లె ప్రసాద్ రావు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కే ఓబయ్య దప్పు కళాకారుల సంఘం నాయకులు శేఖర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వికేంద్రీకరణకే మా మద్దతు

### - - నంద్యాల ఎమ్మెల్యే ఎమ్మెల్సీ జేఏసీ నాయకులు...

నంద్యాల :- మూడు రాజధానుల ఏర్పాటు పరిపాలన వికేంద్రీకరణకు మద్దతుగా కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతూ నంద్యాల పట్టణం గాంధీ చౌక్ లో జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పరిపాలన వికేంద్రీకరణ కు మద్దతుగా మూడు రాజధానుల ఏర్పాటు చేయాలని అలాగే కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణం గాంధీ చౌక్ నందు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్సీ ఇషాక్ భాష మున్సిపల్ చైర్ పర్సన్ మాభూన్నిసా, పట్టణ ప్రముఖులు ప్రజాసంఘాల నాయకులు రైతు సంఘాల నాయకులు విద్యార్థి యువజన సంఘాల నాయకులు వ్యాపార వాణిజ్య సంఘాల నాయకులు మేధావులు హాజరయ్యారు ముందుగా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఇతర నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని వికేంద్రీకరణకు మద్దతు తెలియజేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం చేపట్టి నేటికీ 85 సంవత్సరాలు పూర్తికాబడిన రోజున రాయలసీమ అభివృద్ధిని కాంక్షిస్తూ కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. నాడు కర్నూలులో ఉన్న రాజధానిని త్యాగం చేశామని రాయలసీమ వాసులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అందరి శ్రేయస్సు కోసం వేల ఎకరాల సాగునీరు తాగునీటికి శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణానికి రాయలసీమ వాసులు భూములను త్యాగం చేశారన్నారు. నాడు జరిగిన అన్యాయాన్ని నేటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధించాలంటే వికేంద్రీకరణతోనే సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చరిత్రత్మక నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. నాడు కర్నూలును కోల్పోయామని అలాగే హైదరాబాదును కోల్పోయామని ఇప్పుడు ఇలాగే ఉంటే కర్నూలు న్యాయ రాజధాని కూడా కోల్పోతామన్నారు . ఇది రాయలసీమ వాసుల ఆత్మగౌరవం కర్నూలు నంద్యాల జిల్లా వాసుల ఆత్మగౌరవం అని మన పిల్లల భవిష్యత్తును తాకట్టు పెట్టేందుకు తాము సిద్ధంగా లేమని తెలియజేశారు. కర్నూలులో మాయు రాజధాని సాధించేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు కర్నూలులో న్యాయ రాజధానిని రాకుండా అడ్డుపడితే ఎవరిని విస్మరించేది లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కర్నూలులో నే రాజధాని ఏర్పాటు చేయాల్సిందేనని తప్పదని చెప్పారు. భావితరాల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని ప్రతి ఒక్కరూ మద్దతు తెలియజేయాలని రాజకీయాలతో ప్రమేయం లేకుండా అన్ని పార్టీల ప్రజా సంఘాలు మేధావులు విద్యార్థి సంఘాలు అందరూ కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పడకపోతే మరి ఎప్పటికీ రాదని అందరూ వివేకంతో ఆలోచించాలని తమగలం ఇవ్వాలని కోరారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో కర్నూలులో న్యాయ రాజధాని ఇస్తానని చెబుతున్నారని కాబట్టి మనమందరం నిర్లక్ష్యం చేయకుండా విస్మరించకుండా పోరాటం చేద్దామని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం అని కోరారు. ఇది రాయలసీమ వాసుల ఆత్మగౌరవం మనోభావాలకు సంబంధించిన అంశం కర్నూలు జిల్లా నంద్యాల జిల్లా వాసుల హక్కు అని దీనిని ఎవరు రాజకీయం చేయరాదని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా రాయలసీమలో పంటలు పండగ నీరు లేక బాధలు పడ్డామని గుర్తు చేశారు బూటకపు మాటలు మాయ మాటలు కల్లిబుల్లి మాటలు చంద్రబాబు ఆయన దత్తపుత్రుడు మానుకోవాలని హితవు పలికారు. కర్నూలు రాజధానిపై టిడిపి నాయకులు తమ మనోభావాలను బహిరంగ తెలియజేయాలని హైకోర్టు కావాలా వద్ద అన్న అంశంపై వారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం కేవలం రాయలసీమ వాసుల ఆత్మ గౌరవానికి సంబంధించింది మాత్రమేనన్నారు. ఇందులో ఎటువంటి రాజకీయాలకు తావు లేదని స్పష్టం చేశారు. మాతోపాటు కలిసి రావాలని పోరాటంలో భాగస్వాములు కావాలని టిడిపి నాయకులను ఇతర పార్టీ నాయకులను కోరారు. కర్నూల్ లో న్యాయ రాజధానిని ఏర్పాటు చేసినందుకు జేఏసీ నాయకుల వెంట ఉంటామని సంపూర్ణ మద్దతు ఉంటుందని ఉ ద్యమం ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. సమయం ఆసన్నమైందని నూటికి నూరు శాతం కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాల్సిందేనని గంట పరంగా చెబుతున్నామన్నారు మన ఊపిరి ఉన్నంతవరకు పోరాడుదాం

## జూలేపల్లి రైతులపై అక్రమంగా వేసిన కేసును ఉపసంహరించుకోవాలి--యస్ డి పి ఐ నాయకులు

నంద్యాల :-జూలపల్లి గ్రామ రైతుల భూములపై ప్రభుత్వ అధికారులు , గోస్పాడు మండల వైఎస్సార్సీపీ ప్రముఖ రాజకీయ నాయకుల ఒత్తిడులు చేయడం భయాందోళనకు గురి చేయడంతో జూలపల్లి గ్రామ రైతులు న్యాయస్థానాన్ని (కోర్టును) ఆశ్రయించి ప్రభుత్వ అధికారులపై కేసు నమోదు చేయడం జరిగిందని దీనికి కక్ష సాధింపుగా జూలేపల్లి గ్రామ రైతులపై చెయ్యని నేరానికి గోస్పాడు మండలం వైఎస్ఆర్సిపి నాయకుడు మరియు ప్రభుత్వ అధికారులు రాజకీయ ఒత్తిడిల వల్ల జూలేపల్లి గ్రామ రైతులపై అక్రమ కేసును నమోదు చేసిన గోస్పాడు పోలీసులు వేదించడం సరైన పద్ధతి కాదని యస్ డి పి ఐ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జూలేపల్లి గ్రామం లోని సర్వే నంబర్ 294 నందు వంశపార పర్యంగా పంటలు పండిచుకొంటున్న రైతులను,2022 పంట సీజన్లో పంటలు పండించుకోకుండా రెవెన్యూ అధికారులు ఏ నోటీసులు రైతులకు ఇవ్వకుండా అడ్డుపడడంతో,294 సర్వే రైతు తన వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలతో ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జ్ వారిని ఆశ్రయించగా వారు వాయస్ /0000398/2022 నంబర్ తో ప్రభుత్వ అధికారులపై కేసు నమోదు అయ్యింది. కేసు కోర్టులో నడుస్తోంది. ఇది ఎలా ఉండగా కోర్టులో కేసు నంబర్ వచ్చిన తర్వాత కోర్టును ఆశ్రయించిన రైతుపై గోస్పాడు మండల ప్రముఖ వైఎస్ఆర్సిపి రాజకీయ నాయకుల మరియు ప్రభుత్వ అధికారుల రాజకీయపరంగా ఒత్తిడి పెరిగింది. పోలీస్ డిపార్ట్మెంట్ పై కూడా రాజకీయ ఒత్తిడిలు పెరగడంతో గోస్పాడు ఎస్సై , రైతు పై చేయని నేరానికి ఎఫ్ఐఆర్ నమోదు చేశారని .ప్రభుత్వ అధికారులు , రాజకీయ నాయకులు , కాంట్రాక్టర్లు జూలేపల్లి గ్రామ రైతులకు భయాందోళనకు గురి చేయడం బెదిరించడంతో జూలేపల్లి గ్రామ రైతు తనకు ప్రాణహాని ఉందని, ఈ ఆపద నుండి రక్షించమని, జూలేపల్లె గ్రామ రైతులు సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీని ఆశ్రయించి యస్ డి పి ఐ పార్టీ నంద్యాల అసెంబ్లీ ప్రెసిడెంట్ అబ్దుల్ కలాం వారి ఆవేదనను విన్నవించుకోవడం జరిగింది. అదేవిధంగా జూలేపల్లి గ్రామ రైతు యస్ డి పి ఐ స్టేట్ ప్రెసిడెంట్ అతఉల్లా ఖాన్, జనరల్ సెక్రెటరీ అబ్దుల్లా ఖాన్ దృష్టికి కూడా తమకు జరిగిన అన్యాయంపై జరిగిన సంఘటన లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడం జరిగింది. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకూ తోడ్పాటు అందిస్తామని చెప్పడం జరిగింది. జూలేపల్లి గ్రామ రైతులపై జరుగుతున్న అన్యాయంపై ఇతర రాజకీయపార్టీలు కూడా జూలపల్లి గ్రామ రైతులకు తమ వంతు మద్దతు పలికి ఈ సమస్యపై జూలేపల్లి గ్రామ రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయడానికి ముందుకు రావాలని కోరడం జరిగింది.



# వాల్తేరు వీరయ్య సాంగ్ విడుదల

'గాడ్ ఫాదర్' చిత్రంతో ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన చిరంజీవి, మూడు నెలల గ్యాప్తో 'వాల్తేరు వీరయ్య'గా రాబోతున్నారు. అభిమానులు ఆయన




నుండి ఆశించే అన్ని రకాల మాస్ కమర్షియల్ ఎలిమెంట్స్తో దీన్ని తెరకెక్కిస్తున్నాడు దర్శకుడు బాబి. చిరంజీవికి జంటగా శ్రుతిహాసన్ నటిస్తోంది. రవితేజ కీలకపాత్ర పోషిస్తున్నాడు. బాలీవుడ్ హీరోయిన్ ఊర్వశి రౌటేలా స్పెషల్ సాంగ్ చేస్తోంది. టైటిల్ టీజర్తో సినిమా ఎంత మాస్గా ఉండబోతోందో చెప్పిన టీమ్, త్వరలోనే ఒక్కో పాటను విడుదల చేయబోతున్నారు. ఈ వారంలోనే ఫస్ట్ సింగిల్ని రిలీజ్ చేయబోతున్న విషయాన్ని ఆదివారం దేవిశ్రీ ప్రసాద్ రివీల్ చేశాడు. 'ఇప్పుడే 'వాల్తేరు వీరయ్య' ఫస్ట్ సాంగ్ చూశా. మెగాస్టార్ స్టెప్పులు మైండ్ బ్లోయింగ్గా ఉన్నాయి. అందుకే కంట్రోల్ చేసుకోలేక మొదటి పాట ఈ వారంలోనే రాబోతోందని లీక్ చేస్తున్నా' అంటూ ఊరిస్తున్నాడు దేవిశ్రీ. అంతేకాదు.. 'పార్టీకి రెడీ అవ్వండి.. ఎందుకంటే ఇది బాస్ పార్టీ' అంటూ ఆ పాటేమిటో కూడా రివీల్ చేశాడు. పాటతో పాటు మెగా డ్యాన్సులపై అంచనాలు పెరిగాయి. మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది.

# హిడింబ విడుదలకు సిద్ధం




'రాజుగారి గది' ఫ్రాంచైజీతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అశ్విన్ డిఫరెంట్ స్క్రిప్టులతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు రెడీ అవుతున్నాడు. తను హీరోగా అనీల్ కన్నెగంటి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'హిడింబ'. నందితా శ్వేత హీరోయిన్. శ్రీధర్ గంగపట్నం నిర్మిస్తున్నారు. రీసెంట్గా ఈ మూవీ షూటింగ్ పూర్తయిందని తెలియజేస్తూ, ట్రైలర్ లోడింగ్ అంటూ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్సులు ఆడియెన్స్ ని థ్రిల్ చేస్తాయంటున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ , టీజర్కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. యాక్షన్ థ్రిల్లర్గా తెరకెక్కిన ఈ సినిమాలో అశ్విన్ మాస్ లుక్లో కనిపించనున్నాడు. శుభలేఖ సుధాకర్, శ్రీనివాసరెడ్డి, రఘు కుంచె, రాజీవ్ కనకాల, సమీర్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. వికాస్ బడిసా సంగీతం అందిస్తున్నాడు. కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్ రాస్తున్నారు.

# సంక్రాంతి బరి ఉంచి తప్పుకున్న వారసుడు



కోలీవుడ్కు సమానంగా టాలీవుడ్లో క్రేజ్ సంపాదించుకుంటున్న నటుడు విజయ్ దలపతి తుపాకి, అదిరింది, మాస్టర్ వంటి సినిమాలతో తెలుగులో మంచి మార్కెట్ ఏర్పరుచుకున్నాడు. ప్రస్తుతం విజయ్ 'వారసుడు' సినిమా చేస్తున్నాడు. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. శ్రీవెంకటేశ్వరా క్రియేషన్స్ పతాకంపై దిల్రాజు ఈ చిత్రాన్ని నిర్మించాడు. ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే తాజాగా ఈ చిత్రం పోస్ట్ పోన్ కానున్నట్లు తెలుస్తుంది.సంక్రాంతికి వారసుడుతో పాటు వీరసింహా రెడ్డి, వాల్తేరు వీరయ్య సినిమాలు రిలీజ్ కానున్నాయి. దాంతో థియేటర్లు మూడుగా పంచుకోవాల్సి ఉంటుంది. అయితే దిల్రాజు ఈ రెండు చిత్రాలను కాదని వారసుడు సినిమాకు ఎక్కువ థియేటర్లను కేటాయించాడని సమాచారం. నిజానికి వారసుడు ఒక డబ్బింగ్ మూవీ. ఇటీవలే షూటింగ్ బంద్ సమయంలో అన్ని సినిమాల చిత్రీకరణలు ఆగిపోతే.. వారసుడు మాత్రం షూటింగ్ జరుపుకుంది. అదేంటని అడిగితే.. దిల్రాజు అది డబ్బింగ్ సినిమా అని చెప్పాడు. దాంతో ఇప్పుడు నిర్మాత మండలి కౌన్సిల్ కార్యదర్శి టి. ప్రసన్న కుమార్ సంక్రాంతి, దసరాలకు స్ట్రెయిట్ తెలుగు సినిమాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. దిల్రాజు రజనీకాంత్ 'పేట' రిలీజ్ టైంలో థియేటర్ల గురించి మాట్లాడుతూ సంక్రాంతికి స్ట్రెయిట్ సినిమాలుండగా డబ్బింగ్ సినిమాలకు థియేటర్లు ఎలా ఇస్తాం అంటూ ఘాటుగా వ్యాఖ్యలు చేశాడు. ఇక ఇప్పుడు దాంతో వీరసింహా రెడ్డి, వాల్తేరు వీరయ్య సినిమాలున్నప్పుడు వారసుడు సినిమాకు థియేటర్లు ఎలా ఇస్తారు అంటూ పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్గా తెరకెక్కిన వారసుడు సినిమాలో విజయ్కు జోడీగా రష్మిక మందన్నా నటిస్తుంది. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఇటీవలే రిలీజైన రంజితమే సాంగ్కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది.



# ఐపీఎల్ వేలానికి వేళాయెరా

ముంబై, నవంబర్ 16, (న్యూస్ పల్స్)ఐపీఎల్ 2023 లో రీటెయిన్ మరియు రిలీజ్ చేసే ఆటగాళ్ల జాబితాను అన్ని జట్లు బీసీసీఐకి సమర్పించాయి. నవంబర్ 15తో గడువు ముగియటంతో ఫ్రాంచైజీలన్నీ తాము అట్టి పెట్టుకున్న, విడుదల చేసిన ప్లేయర్ల లిస్టును బీసీసీఐకి అందజేశాయి.కొన్ని ఫ్రాంచైజీలు అగ్రశ్రేణి ఆటగాళ్లను వదిలేశాయి. మరికొన్ని ఎక్కువ మందిని రిలీజ్ చేసి తమ పర్స్ వాల్యూ పెంచుకున్నాయి. రిలీజైన ఆటగాళ్లు డిసెంబర్ 23న కొచ్చిలో జరిగే వేలంలో అందుబాటులోకి వస్తారుముంబయి పొలార్డ్ కు బై5 సార్లు ఛాంపియన్గా నిలిచిన ముంబయికి గత సీజన్ ఓ పీడకల. పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. అందుకే ఈసారి పెను మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో విధ్వంసకర ఆటగాడు కీరన్ పొలార్డ్ను వదిలేసింది. అలాగే అన్మోల్ప్రీత్ సింగ్, ఆర్యన్ జుయల్, బసిల్ థంపి, డానియల్ సామ్స్, ఫాబియన్ అలెన్, జయ్దేవ్ ఉనద్కత్, మయాంక్ మార్కండే, మురుగన్ అశ్విన్, రాహుల్ బుద్ధి, రిలీ మెరెడిత్, సంజయ్ యాదవ్, టైమల్ మిల్స్ను రిలీజ్ చేసింది. అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: రోహిత్ శర్మ (కెప్టెన్), టిమ్ డేవిడ్, రమణ్దీప్ సింగ్, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, డెవాల్డ్ బ్రెవిస్, ట్రిస్టన్ స్టబ్స్, జస్ప్రీత్ బుమ్రా, జోఫ్రా ఆర్చర్, అర్జున్ తెందూల్కర్, హృతిక్ షోకీన్, కుమార్ కార్తికేయ సింగ్, జాసన్ బెహ్రెన్డార్ఫ్, అర్షద్ ఖాన్, అకాశ్ మాధ్వాల్.చెన్నైతోనే జడేజాచెన్నై జట్టులో కీలక ఆటగాడైన రవీంద్ర జడేజాకు, యాజమాన్యానికి మధ్య విభేదాలు వచ్చినట్లు కొంతకాలం క్రితం వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో అతడిని ఫ్రాంచైజీ విడుదల చేస్తుందని భావించారు. అయితే అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ చెన్నై జడేజాను రిటైయిన్ చేసుకుంది. అయితే ఆల్ రౌండర్ డ్వేన్ బ్రావోను రిలీజ్ చేస్తూ అనూహ్య నిర్ణయం తీసుకుంది. అతడితోపాటు ఆడమ్ మిల్నే, క్రిస్ జొర్డాన్, ఎన్. జగదీశన్, సి. హరినిశాంత్, కే. భగత్ వర్మ, కేఎం. అసిఫ్, రాబిన్ ఉతప్ప (రిటైర్డ్)ను రిలీజ్ చేసింది. అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు: ఎంఎస్ ధోనీ (కెప్టెన్), డెవాన్ కాన్వే, రుతురాజ్ గైక్వాడ్, అంబటి రాయుడు, శుభ్రాన్షు సేనాపతి, మొయిన్ అలీ, శివమ్ దూబె, రవీంద్ర జడేజా, డ్వేన్ ప్రిటోరియస్, మహీష్ తీక్షణ, ప్రశాంత్ సోలంకి, దీపక్ చాహర్, ముకేశ్ చౌదరి, సిమర్జీత్ సింగ్, తుషార్ దేశ్పాండే, రాజ్వర్ధన్ హంగర్గేకర్, మిచెల్ సాంట్నర్, మహీషా పతిరానహైదరాబాద్ కెప్టెన్ ఔట్గత సీజన్లో దారుణ ప్రదర్శన చేసిన హైదరాబాద్ భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఏకంగా కెప్టెన్ కేన్ విలియమ్సన్ నే వదిలేసింది. మరో సీనియర్ బ్యాటర్ నికోలస్ పూరన్ ను రిలీజ్ చేసింది. వీరితోపాటు జగదీశ సుచిత్, ప్రియమ్ గార్గ్, రవికుమార్ సమర్థ్, రొమారియో షెఫర్డ్, సౌరభ్ దూబె, సీన్ అబాట్, శశాంక్ సింగ్, శ్రేయస్ గోపాల్, సుషాంత్ మిశ్రా, విష్ణు వినోద్ను వదులుకుంది. దీంతో ఆ ఫ్రాంచైజీ ఖాతాలో రూ. 42.25 కోట్లు ఉన్నాయి. అన్ని ఫ్రాంచైజీలు కన్నా హైదరాబాద్ వద్దే ఎక్కువ పర్స్ వాల్యూ ఉంది. ఆటగాళ్లు: అబ్దుల్ సమద్, అయిడెన్ మార్క్రమ్, రాహుల్ త్రిపాఠి, గ్లెన్ ఫిలిప్స్, అభిషేక్ శర్మ, మార్కో జాన్సెన్, వాషింగ్టన్ సుందర్, ఫజల్హక్ ఫరూఖి, కార్తిక్ త్యాగి, భువనేశ్వర్ కుమార్, టి. నటరాజన్, ఉమ్రాన్ మాలిక్.కోల్కతా కీలక నిర్ణయాలుకోల్కతా కఠిన నిర్ణయాలను తీసుకున్నట్లు కనిపిస్తోంది. కీలక ఆటగాళ్లు ప్యాట్ కమిన్స్, సామ్ బిల్లింగ్స్, అమన్ ఖాన్, శివమ్ మావి, మహమ్మద్ నబి, చమిక కరుణరత్నె, ఆరోన్ ఫించ్, అలెక్స్ హేల్స్, అభిజిత్ తోమర్, అజింక్య రహానె, అశోక్ శర్మ, బాబా ఇంద్రజిత్, పార్థమ్ సింగ్, రమేశ్ కుమార్, రసిఖ్ సలామ్, షెల్డన్ జాక్సన్లను వదిలేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**